# జెకర్యా మరియు ఎలిశ బేతమ్మ
# బప్తిస్మ యోహాను తల్లిదండ్రులు: దైవభక్తిగల తల్లిదండ్రులు
# లూకా 01: 05-25

## *పరిచయం:*

*దైవికమైన తల్లిదండ్రుల యొక్క వృత్తాంతము ప్రతితరములోను అవసరమైయున్నది. బప్తిస్మ యోహాను యొక్క తల్లిదండ్రులు దైవికమైనవారు, దైవభక్తికలవారు. తల్లిదండ్రులటే ఎలా ఉండాలో దానికి ఆదర్శమైనవారు. వారు కూడా మనవలె కొన్ని బలహీనతలు కలిగిన మానవులే. అయినప్పటికి వారు అందరు అనుసరించవలసిన రీతిలో మనందరకు ఆదర్శప్రాయులుగా నిలిచారు.*

I. బప్తిస్మ యోహాను యొక్క తల్లిదండ్రులు (వ.5)

II. వారు నీతి ప్రవర్తన గలిగిన తల్లిదండ్రులు (వ.6)

III. వారు ఈ లోక సమస్యలుగల తల్లిదండ్రులు (వ.7)

IV. వారు దేవుని ఆరాధించు తల్లిదండ్రులు (వ.8-9)

V. వారు ప్రార్థించుట మరియు ఇతరులను ప్రార్థనయందు నడిపించు తల్లిదండ్రులు (వ.10)

VI. వారు దేవుని అనుగ్రహమునకు పాత్రులైన తల్లిదండ్రులు (వ.11-17)

VII. వారు మానవులకు అసాధ్యమైన దానిని విశ్వసించుటకు వెనకాడిన తల్లిదండ్రులు (వ.18-19)

VIII. వారు దేవునిచే సరియైన రీతిలో మలచబడిన తల్లిదండ్రులు (వ.20-22)

IX. వారు దేవుని వాగ్దానములు నెరవేర్చబడుటకు సాక్షులుగా ఉన్న తల్లిదండ్రులు (వ.23-25)

## I. లూకా 01:05 బప్తిస్మ యోహాను యొక్క కుటుంబము

బప్తిస్మ యోహాను యొక్క తల్లిదండ్రులు - మూడు విషయములను గమనించండి.

1. హేరోదు రాజు పరిపాలనా కాలము యొక్క చివరి రోజులలో (క్రీ.పూ.37-క్రీ.శ.4) యోహాను తల్లిదండ్రులకు అతని పుట్టుకను గురించి వాగ్దానమివ్వబడెను. (మత్తయి. 2:3-4)

2. యోహాను తండ్రి పేరు జెకర్యా.

   ఎ. జెకర్యా అనగా యెహోవాను గుర్తుంచుకొన్నవాడు అని అర్థము.





   బి. అతడు గ్రామీణ ప్రాంతము నుండి వచ్చినవాడు. బహుశ కొంతప్రాంతముగాని, పర్వత ప్రాంతము నుండి వచ్చినవాడు.

   సి. అతడు 'అభిజా' వంశమునకు చెందిన అర్చక కుటుంబమునకు చెందినవాడు. ఇది కేవలం మతాధికారుల భిన్న తెగలను చూపిస్తుంది. ఆరోను వంశములో ఉన్న మగ వారందరు పూజారులేనని గుర్తుంచుకోండి. అందుచేత గురువులు ఇరవైవేలకుపైగా వున్నారు. కాని దేవాలయం మాత్రం ఒక్కటే. అందుచేత వారు వివిధ సమూహాలుగా విభజింపబడ్డారు. (1 రా.ది.చ.24:1-6). జెకర్యా ఎనిమిదవ వర్గమునకు చెందినవాడు. (1 రా.ది.చ.24:10). ఆ విధముగా మొత్తం ఇరవైనాలగు గుంపులున్నాయి. ప్రతి సమూహం సంవత్సరానికి రెండుసార్లు ఒకవారం పాటు దేవాలయంలో పూజలందించేవారు.

3. యోహాను తల్లి - ఎలిశబేతమ్మ

   ఎ. ఆమె పేరుకు 'దేవునికి అంకితమైన వ్యక్తి' అని అర్థము.

   బి. ఆమె ఒక యాజకుని కుమార్తె.

   సి. ఆమె తన వివాహము వరకు పరిశుద్ధముగా, కన్యకగా ఉండెను. ఒక యాజకుడు కన్యను మాత్రమే వివాహము చేసుకొనవలయును. (లెవి 21:14)

### హేరోదు రాజు : యూదుల రాజు (మత్తయి 02: 02-03)

అతడొక క్రూరమైన నిరంకుశ పాలకుడు. అతడు తన స్వంత కుటుంబ సభ్యులను చాలామందిని, తన సొంత భార్యతోసహా, (అతనికి పదిమంది భార్యలుండిరి) ఆమె తాతను, ఆమె సోదరుని, తన సొంత కుమారులలో కొందరిని, హత్య చేసెనని చరిత్ర లేఖనములు తెలియజేస్తున్నాయి. ఒకసారి యూదా ప్రభుత్వపాలక మండలియైన 'సంహెద్రిన్'లోని సభ్యులందరిని హత్యచేసెనని తెలుస్తుంది. ఇంకొకసారి యెరుషలేమునందుగల ప్రతి ఉన్నతాధి కారిని చంపించెను. రాజుగా అతని పాలన చాలా ఎక్కువ సంవత్సరములు ఉన్నది (క్రీ.పూ.37 నుండి క్రీ.శ.4 వరకు) హేరోదు రాజ్యాధికార చివరి రోజులయందు క్రీస్తు జన్మించెను. ఈ సంఘటనలన్నియు అతడు ఎంత క్రూరమైన రాజు అని మనకు తెలియజేస్తున్నాయి. అక్కడ రాజ కుమారుడు సింహాసనమును అధిష్ఠించే పరిస్థితులే లేవు. అయినప్పటికీ ఒక రాజ కుమారుడు జన్మించాడు అని తెలిసేసరికి అతడు భయభ్రాంతుడయ్యాడు. అతడు దుష్ట శక్తులచే నింపబడిన వ్యక్తి. అతడు అనుమానపడువాడు, క్రూరుడు మరియు రక్తపిపాసి. హేరోదు బెత్లేహేమునందే గాక, దాని పరిసరాలయందు గల మగబిడ్డలందరిని చంపించాడు. ☐

## II. లూకా 01:06 నీతిమంతులైన యోహాను తల్లిదండ్రులు

వారు నీతిమంతులైన తల్లిదండ్రులు. నాలుగు విషయాలను గమనించండి.

1. వారిరువురు ఏ తప్పిదము లేక ధైర్యముతో నిలబడినవారు. వారిరువురు భార్యాభర్తలయిన తరువాత ఒకరికి ఒకరు అంకితమై దేవుని కొరకు మరియు భార్యభర్తలుగా ఒకరికొకరు అంకితమై జీవించిరి.

2. దేవుని దృష్టిలో వారిరువురు నీతిమంతులుగా నిలబడిరి. వారిరువురు దేవుని ఆజ్ఞల ప్రకారము ఆయనను వెదకుచు, ఆయన యందు సంతోషముతో కలిసి జీవించిరి.

3. వారు దేవుని ఆజ్ఞలన్నింటిని మరియు ఆయన నియమములన్నింటిని పూర్తిగా పాటించుచుండిరి. వారు చేయునదంతటిలోను దేవుని సంతోషపరచునట్లుగా తమ ఆలోచనలను, మనస్సులను, మాటలను, ప్రవర్తనను అదుపునందుంచుకొనిరి.

4. వారు ఏ దోషములేనివారు. అయితే దీని అర్థమువారు పరిపూర్ణత కలిగి యున్నారని కాదు. వారు దేవునికి విశ్వాసపాత్రులుగా, ఎవరును వారియందు దోషములు కనిపెట్టనంతగా పరిశుద్ధులుగా జీవించిరి. వారు ఎవరికి హానిచేయక, దేవునికి, మానవుని ఎదుట పరిశుద్ధులుగా జీవించిరి.

## III. లూకా 01:07 యోహాను తల్లిదండ్రుల సమస్యలు

అయితే వారు తమ జీవితములో అనేక సమస్యలను ఎదుర్కొంటున్న మానవ తల్లిదండ్రులు. వారు నీతిమంతులుగా జీవించినప్పటికీ, సమస్యలు వారికి దూరం కాలేదు. ఈ లోకమందు మిగిలిన వారందరు సమస్యలను ఎదుర్కొనునట్లుగానే, వారు సమస్యలను ఎదర్కొన్నారు. అయితే తేడా ఏమిటంటే, అన్ని సమస్యలలోను వారు నీతిమంతులుగా దేవుని ఎదుట నిలబడ్డారు. అందుచేత దేవుని సన్నిధి వారికి అన్ని సమస్యలలోను తోడుగా ఉంది. వారికి రెండు ముఖ్యమైన సమస్యలున్నాయి.

1. వారికి సంతానము లేదు. ఆ రోజులలో ఇది ఒక విషాదకరమైన పరిస్థితి. సంతానము దేవుని యొక్క ఆశీర్వాదములుగా భావించేవారు. దేవుని యొక్క అమూల్య వారసత్వం. నిజానికి సంతానములేని భార్యను కలిగిన యూదుడు దేవుని నుండి దూరమైపోయాడని ఆ రోజులలో భావించేవారు. కాబట్టి అతడు తన భార్యకు విడాకులిచ్చి, తిరిగి వివాహం చేసుకొని సంతానం కలిగి యుండాలని అందరు తలంచేవారు. కాబట్టి సంతానం లేకపోవడం జెకర్యా, ఎలీశబేతమ్మ లకు ఒక క్లిష్టమైన సమస్యగా తయారయింది. వారి హృదయాలను, వారి మనస్సులను భారమైన కలతలకు గురిచేస్తున్న సమస్య! తాము దేవుని అనుగ్రహమునకు నోచుకోలేదని, ఆయనకు ప్రీతిపాత్రులు కాలేదని వారు భావించారు.



జెకర్యా మరియు ఎలిశబేతమ్మ బప్తిస్మ యోహాను తల్లిదండ్రులు: దైవభక్తిగల తల్లిదండ్రులు

2. వారు ముసలివారయ్యారు. వయస్సు పెరిగే కొద్దీ మానవులకు వచ్చే సమస్యలన్నీ వారికున్నాయి, లేదా భయాన్ని కలిగిస్తూ ఎదురుగా పొంచియున్నాయి.

   ***మత్తయి 5:45*** *"అప్పుడు మీరు పరలోకమందున్న మీ తండ్రికి తగిన బిడ్డలు కాగలరు. ఏలయన, ఆయన దుర్జనులపై, సజ్జనులపై సూర్యుని ఒకే విధముగా ప్రకాశింపజేయుచున్నాడు. సన్మార్గులపై, దుర్మార్గులపై వర్షము ఒకేవిధముగా వర్షింపజేయుచున్నాడు."*

   ***1 కొరింతి 10:13*** *"మానవులకు సాధారణము కాని ఏ శోధనయు మీకు కలుగలేదు. ఏలయన దేవుడు నమ్మదగినవాడు. మీ నిగ్రహశక్తిని మించి మిమ్ము శోధింపబడనీయడు. అంతేగాక, మీరు శోధింపబడునప్పుడు, దానిని సహింపగలశక్తిని మీకు ఒసగిబయటపడు మార్గమును మీకు ఆయన చూపును."*

   ***కీర్తన 69:20*** *"పరనిందలు నా హృదయమును ముక్కలు చేసెను. నేను బలమును కోల్పోయితిని. నేను సానుభూతిని ఆశించితిని. కాని అది లభ్యము కాదయ్యెను. ఓదార్పును అభిలషించితిని. కాని అది లభింపదయ్యెను."*

## IV. లూకా 01:08-09 యోహాను తల్లిదండ్రుల భక్తిపూర్వకమైన ఆరాధన

వారు ఎల్లప్పుడు ఆరాధించు తల్లిదండ్రులు. జెకర్యా ఆయన గురుత్వమునకు విశ్వాసపాత్రుడై యుండును. అతడు యాజకునిగానుండుటకు దేవునిచే ఎన్నుకొనబడెను, అభిషేకించబడెను. కావున అతడు తన పిలుపుకు విశ్వాసపాత్రునిగానుండెను. అతడు సంతానము లేక, దేవుని ఆశీర్వాదములకు కొరత పడినప్పటికీ, తన విధుల నిర్వహణయందు నిష్ఠత కలిగి, నిబద్ధతతోనుండెను. సంతానము కలిగియుండుట ఆ రోజులయందు గొప్ప ఆశీర్వాదకరముగాను, దేవుని సంతృప్తికి ఒక గురుతుగాను భావింపబడునని గుర్తుంచుకోండి. సంతానము లేకపోవుట దేవుని అసంతృప్తికి గురుతుగా భావించ బడేది.

అసలు జరిగిన విషయం ఇది. ప్రతి దినము దేవాలయ ఆరాధనయందు ఉదయకాల అర్పణకు ముందు మరియు సాయంకాల అర్పణ తరువాత యాజకునిచే పీఠముముందు సాంబ్రాణి ధూపనైవేద్యము వేయబడుతుంది. సాంబ్రాణి ధూపము దేవునియందు అర్పించే అర్పణలు చాలా మధురముగాను, భక్తియుతముగాను జరుగుచున్నాయనుటకు గురుతు. సాంబ్రాణి ధూపము కూడా ఒక రకమైన ప్రార్థనే! అది అర్పణలన్నింటిని కప్పివేసి, దానిని దేవుని సింహాసనము వద్దకు కొనిపోవును.

దేవుని పీఠము ముందు సాంబ్రాణి ధూపనైవేద్యము తమ యాజక కర్తవ్యాలలో అతి ముఖ్యమైనదని యాజకులు భావించేవారు. అయితే, యాజకుల సంఖ్య చాలా ఎక్కువ కాబట్టి, కొందరికి ఇలా ధూపనైవేద్యము

దేవునికి అర్పించే అవకాశము అసలు రాదు. అందుచేత ధూపము ఎవరు వేయాలన్న విషయాన్ని అదృష్ట చీటిల ద్వారా నిర్ధారిస్తారు. ప్రత్యేకమైన ఆరోజు, తన జీవితంలోకెల్లా అతి గొప్ప అవకాశము జెకర్యాకు లభించింది. అదృష్ట చీటిలో అతని పేరు వచ్చింది. కావున ఆ రోజు ధూపనైవేద్యము వేయు అవకాశము జెకర్యాకు లభించింది.

అసలు విషయం ఏమిటంటే! జెకర్యా దేవుని పిలుపుకు విశ్వాసనీయునిగా ఉన్నాడు. అతడు దేవుని చేత యాజకునిగా ఎన్నుకొనబడ్డాడు, అభిషేకించబడ్డాడు. అతడు ఆ పిలుపును స్వీకరించి దానికి తన జీవితమును అంకితం చేశాడు. అతనికెన్ని సమస్యలున్నప్పటికిని, సంతానము లేనందువలన దేవుని అనుగ్రహమునకు అతడు నోచుకొనలేదన్న అపవాదు అతడిపై ఉన్నప్పటికి, అతడు తన ఆరాధనయందు ఎంతో నిష్ఠగా, విశ్వాసముతో ఉన్నాడు.

***యాకోబు 1:12*** *"శోధనకు గురియైనను విశ్వాసమును కోల్పోని వ్యక్తి ధన్యుడు. ఏలనన, పరీక్షయందు అతడు ఉత్తీర్ణుడగుటతో అతనికి జీవ కిరీటము ప్రసాదింపబడును. అది తనను ప్రేమించువారికి దేవుడు వాగ్దానమొనర్చిన బహుమానము."*

***యాకోబు 5:11*** *"వారు సహనము చూపిరి కనుకనే వారిని ధన్యులనుచున్నాము. యోబు సహనమును గూర్చి వినియున్నాము. చివరకు ప్రభువు అతనికి ఏమి ఏర్పాటు ఒనర్చెనో మీకు తెలియును. ప్రభువు ఎంతయో జాలియును, కనికరమును కలవాడు కదా!"*

## V. లూకా 01:10 భక్తిపరుడైన యోహాను తల్లిదండ్రులు

వారు ప్రార్థించు తల్లిదండ్రులు, దేవునికి ధూపనైవేద్యము పెట్టునప్పుడు కూడా జెకర్యా ప్రార్థించుచుండెను. ప్రజల తరపున ప్రార్థించునప్పుడు కూడా అతడు వారిని ప్రార్థనయందు నడిపించెను (వ.13 చూడుము.) వారు ప్రార్థించు ప్రజలుగా అతడు వారిని తయారు చేసెను. అతడున్నట్లుగా వారును ప్రార్థనయందు, ఆరాధనయందు నిమగ్నమైయుండిరి.

***మత్తయి 18:19*** *"భూలోకమున మీలో ఇద్దరు ఏకమనస్కులై ఏమి ప్రార్థించినను, పరలోక మందుండు నా తండ్రి వారికి అది ఒసగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను."*

***1 రా.ది.చ. 16:11*** *"ప్రభువును సాయము అడుగ పొండు. నిరంతరము అతనిని సేవింపుడు."*

***కీర్తన 91:15*** *"వారు నాకు మొరపెట్టినప్పుడు నేను వారికి ప్రత్యుత్తరమిత్తును. వారి ఆపదలో వారిని ఆదుకొందును. వారిని విపత్తుల నుండి కాపాడి, వారికి కీర్తన దయచేయుదును."*





## VI. లూకా 01:11-17 యోహాను తల్లిదండ్రులపై కురిపింపబడిన ఆశీర్వాదములు

వారు దేవునికి అధికముగా ప్రీతికరమైన తల్లిదండ్రులు. ఈక్రింద తెలిపినట్లుగా ఉన్న ఏ తల్లిదండ్రులనైననూ దేవుడు అమితముగా దీవించును, ప్రేమించును.

- నీతిమంతులుగను మరియు నిజాయితీగా నిలబడినవారిని
- ఆరాధించువారిని
- ప్రార్థించువారిని
- ఇతరులను ప్రార్థనయందును, ఆరాధనయందును నడిపించువారిని.

దేవుడు జెకర్యాను, ఎలిశబేతమ్మను అయిదు విధములుగా ఆశీర్వదించెను.

1. ఒక ప్రత్యేక విధముగా, వ్యక్తిగతముగా దేవుడు వారికి సమాధానమిచ్చెను. దేవుడు ఒక దూతను జెకర్యా వద్దకు పంపెను. రూపము వేయబడుచున్న పీఠమునకు అనగా ప్రార్థించు స్థలమునకు కుడిప్రక్కన దేవదూత కనబడినదని గమనించండి. అతడు ప్రార్థించుచుండగా, దేవుని ఆజ్ఞానుసారము, దేవుడు అతనికి వ్యక్తిగతముగా సమాధానమిచ్చెను.

2. వారి ప్రార్థనలు ఆలకించబడెను. లేఖనములో పేర్కొనబడిన సరియైన మాటలను గమనించండి. 'దేవుడు నీ ప్రార్థనను ఆలకించెను.' ఏ ప్రార్థన?

   - తను ముసలివాడైనప్పటికి, తనకు సంతానములేదన్న ప్రార్థనా?
   - యిస్రాయేలు యొక్క రక్షణ, రానున్న మెస్సయ్యా గురించి ప్రార్థనా?
   - తన ప్రజల యొక్క బాగోగుల గురించి ప్రార్థనా?

   లేఖనమును ఈ విషయము స్పష్టముగా వివరించుట లేదు. కాని ఆయన అన్ని ప్రార్థనలు ఆలకించబడెను. ముఖ్యముగా ఎలిశబేతమ్మ ఒక కుమారుని కనును. అతనికి యోహాను అని పేరు పెట్టవలెను. యోహాను అనగా 'యెహోవా యొక్క కృప'.

3. వారి కుమారుడు చాలా గొప్పవాడు కాగలడు.

   ఎ. తన జీవితము వలన అతడు తన తల్లిదండ్రులను సంతోషపెట్టును. తల్లిదండ్రులు తమ బిడ్డలో ఉండవలెనని కోరుకొనువన్ని అతనిలో ఉంటాయి. అతడు వారిని అవమానపరచక, వారి హృదయములను ఎల్లప్పుడు సంతోషముతో నింపును.

బి. అతడు సమాజమునకందించు సేవల వలన ఎంతోమంది సంతోషముగా ఉందురు. వారి స్నేహితులకు, వారి ద్వారా దేశమంతటికిని సంతోషమును ప్రసాదించును. అతనికి గల నిబద్ధతను, సేవలను చూసి ఎంతోమంది సంతోషించెదరు.

సి. దేవుని దృష్టిలో కూడా అతడు ఎంతో గొప్పవాడైయుండును. ఆయన విశ్వాసనీయతవలన మరియు విధేయతవలన ఆయన దేవునికి ప్రీతిపాత్రమగును. పాత నిబంధనయందలి ప్రవక్తల వలె ఆయన గొప్పవాడగును.

డి. అతడు క్రమశిక్షణ కలిగి, నియంత్రణలోనున్న జీవితమును జీవించును. అతడు అవి రకములైన మత్తు పానీయముల నుండి, సాతాను బంధకముల నుండి దూరముగా నుండును.

ఇ. అతడు పుట్టుక నుండియే పవిత్రాత్మచే నింపబడును. ప్రత్యేకమైన సేవల కొరకు నింప బడినట్లుగా, ప్రత్యేక విధముగా ఆత్మచే నిత్యము నింపబడియుండును.

***తలంపు 1:*** యోహానును గొప్పవానిగా తీర్చిదిద్దిన ఐదు విశిష్ట లక్షణాలను గమనించండి. విశ్వాసులందరు కూడా తమ జీవితాలలో అవిఏ విశిష్ట లక్షణములను కలిగియుండుట ఎంతో అవసరమైయున్నది.

***రోమీ 12:1-2*** *"కాబట్టి సోదరులారా! పరిశుద్ధమును దేవునికి ప్రీతికరమును అయిన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని కనికరమును బట్టి మిమ్ము బ్రతిమాలుకొనుచున్నాను. 2 "మీరు ఈలోక ప్రమాణములను అనుసరింపకుడు. దేవుని, మీలో మానసికమైన మార్పు ద్వారా నూతనత్వమును కలుగజేయనిండు. అప్పుడే మీరు దేవుని సంకల్పమును, అనగా ఉత్తమమైనదియు, ఆయనకు సమ్మతమైనదియు, సంపూర్ణమైనది అగుదానిని తెలుసుకొనగలరు."*

***1 తిమోతి 1:12*** *"నాకు శక్తినొసగి, నన్ను విశ్వాసునిగా గుర్తించి తన సేవలకు నన్ను వినియోగించుకొనునందులకు మన ప్రభువైన యేసుక్రీస్తునకు నేను సర్వదా కృతజ్ఞతనొందును."*

***తలంపు 2:*** జెకర్యా మరియు ఎలిశబేతమ్మలయందు మనము గమనించవలసిన విషయము ఏమనగా, దేవుడు వారి ప్రార్థనలను ఆలకించి వారిని దండిగా దీవించెను. వారు అతనికి విశ్వాసపాత్రులుగానున్నారు కావున ఆయన వారిని ప్రీతికరముగా చేసికొనెను.

***యోహాను 15:7*** *"నా యందు మీరును మీ యందు నా మాటలను నిలచియున్నచో, మీరు ఏమి కోరినను అది మీకు ఒసగబడును."*

***యోహాను 3:22*** *"మనము ఆయనను ఏదికోరినను పొందుకొనెదము, ఎందుకనగా మనము ఆయన ఆజ్ఞలను విధేయించి ఆయనకు ప్రీతికరమైనది చేయుచున్నాము.*





4. వారి కుమారుడు ప్రవక్త కానున్నాడు - అతడు ఎంతోమంది ప్రజలను దేవుని వైపు మరల్చును.

5. వారి కుమారుడు రానున్న లోకరక్షకునికి మార్గము సిద్ధము చేయువాడు. ప్రవక్తలందరిలో గొప్పవాడైన ఎలిజావలె అతడు కూడా గొప్పవాడై, ముఖ్యమైన పరిచర్య చేయుచుండును. (మలాకి 4:5; చూడుము మత్తయి 17:10)

## VII. లూకా 01:18-19 జెకర్యా యొక్క అపనమ్మకము

మానవులకు అసాధ్యమైనది జరుగునని విశ్వసించుటకు సంకోచించిన తల్లిదండ్రులువారు. ఇక్కడ రెండు విషయాలను గమనించండి.

1. దేవుని వద్ద నుండి వచ్చిన సందేశమును మరియు వాగ్దానమును జెకర్యా నమ్మలేకపోయాడు. అతడు నిరంతరం ప్రార్థించేవాడు అయినప్పటికి ప్రకృతి నియమాలకు విరుద్ధముగా అసాధ్యమైన దానిని దేవుడు తన ప్రార్థనలకు జవాబుగా జరిపిస్తాడని అతడు కలలో కూడా ఊహించలేదు. జెకర్యా యొక్క ప్రశ్న అపనమ్మకముతో కూడిన ప్రశ్న. పాత నిబంధనలో అబ్రహాము అడిగిన సంశయములాంటిదే ఇది కూడా (ఆది 15:8). అయితే జెకర్యా అపనమ్మకముతో ఈ ప్రశ్నను అడిగాడు. అతడు మరియు ఎలిశబేతు ఇద్దరు సంతానము కలగలేనంతగా ముసలివాళ్ళయి పోయారని అతడు దేవదూతతో పలికాడు.

2. దేవుని వాక్యము మరియు ఆయన వాగ్దానము జెకర్యా యందు నమ్మకము కలిగించాల్సి వుంది. అయితే తన అపనమ్మకముచే అతడు వీటిని నమ్మలేదు. వీటికి తోడుగా ఇంకొక అభయమును అతడు కోరాడు. అతడు ఒక గురుతును కోరుకున్నాడు - దేవుని వాక్కునకు మరియు ఆయన వాగ్దానమునకు తోడుగా ఇంకొక గురుతు (చూడండి లూకా 1:19).

### లూకా 01:19 గబ్రియేలు అతిదూత

గబ్రియేలు అనగా దేవుని వీరుడు, దేవుని యోధుడు లేదా దేవుని యొక్క పరాక్రమ వంతుడు అని అర్థము. గాబ్రియేలు తన గురించి రెండు విషయాలు చెప్పుకున్నాడు. గమనించండి.

1) తాను దేవుని సన్నిధిలో ఎల్లప్పుడు అందుబాటులో నిల్చొని ఉండే దూతని.

2) దేవుడు నుండి వచ్చే శుభ సమాచారాన్ని మానవులకు అంజేయు దూతని.

- యిస్రాయేలు యొక్క పునరుద్ధరణ సమాచారాన్ని అతడు దానియేలుకు తెలియజేసాడు (దానియేలు 8:16; 9:21 నుండి)
- రక్షకుని బాటను సిద్ధం చేయు యోహాను పుట్టుకను జెకర్యాకు తెలియజేశాడు. (లూకా 1:130)
- రక్షకుని పుట్టుక గురించిన శుభవార్త మరియకు తెలియజేశాడు (లూకా 1:26 నుండి) ☐

## VIII. లూకా 01:20-22 క్రమశిక్షణా కార్యము

వారు దేవునిచే క్రమశిక్షణలో నియంత్రించబడిన తల్లిదండ్రులు. జెకర్యా దేవుని మాటను విశ్వసించడంలో విఫలం చెందాడు. అందుచేత అతనిని సరియైన మార్గంలో నడిపించాల్సి వచ్చింది. దేవునియందుగల నమ్మికలో ఇంకా ఎక్కువగా వృద్ధి చెందడానికి ఇది తప్పనిసరి.

1. జెకర్యా ఒక గురుతును కోరాడు. అతడు తన హృదయానికి బదులు తన నాలుకను మాట్లాడ నిచ్చాడు. అందుచేత దేవుడు అతనికి ఒక గురుతును ఇచ్చాడు. యోహాను పుట్టక ముందు తొమ్మిది నెలలు అతడు మూగవానిగా ఉండిపోయాడు.

2. జెకర్యా దేవుని మాటను స్వీకరించుట యందు విఫలం చెందాడు. అందుచేత దేవుడు ఇతరులతో మాట్లాడే అతని శక్తిని తాత్కాలికంగా తొలగించాడు.

3. జెకర్యా అపనమ్మకము మరియు అవిశ్వాసముతో కూడిన మాటలు మాట్లాడాడు. అందుచేత దేవుడు అలాంటి అపనమ్మకపు, అవిశ్వాసపు మాటలను ఇక ముందు మాట్లాడకుండా అతనిని కాపాడెను.

   ***తలంపు 1:*** క్రమశిక్షణలో ఉంచే దేవుని హస్తమును గురించి ప్రతి విశ్వాసికి తెలుసు. ప్రతి విశ్వాసి విషయంలో, ఈ పద్ధతి వేరువేరుగా ఉంటుంది. అయితే క్రమశిక్షణలో ఉంచే నిదానాన్ని ప్రతి విశ్వాసి గుర్తిస్తాడు.

   ***హెబ్రి 12:5-6*** *"పుత్రులుగా మీకు ఆయన చెప్పిన ఈ ప్రోత్సాహకరములగు మాటలను మరచితిరా? 'కుమారుడా! ప్రభువు నిన్ను శిక్షించినప్పుడు శ్రద్ధ వహింపుము. ఆయన నిన్ను మందలించినప్పుడు నీవు నిరుత్సాహపడకుము. ఏలన, దేవుడు తాను ప్రేమించువానిని శిక్షించును. తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును."*





***దర్శన 3:19*** *"నేను ప్రేమించువారినందరిని గద్దించుచుందును, శిక్షించుదును. కనుక హృదయ పూర్వకముగా పాపముల నుండి విముఖుడవు కమ్ము."*

***ద్వితి. 8:5*** *"దీనిని బట్టి తండ్రి కుమారునకు వలె ప్రభువు మీకు శిక్షణనిచ్చెనని గ్రహింపుడు."*

***కీర్తన 94:12*** *"ప్రభూ! నీవు ఉపదేశము చేయు నరుడు ధన్యుడు. నీవు ధర్మశాస్త్రము బోధించు జనుడు భాగ్యవంతుడు."*

***సామెతలు 3:1-12*** *"కుమారా! ప్రభువు క్రమశిక్షణను తృణీకరింపకుము. అతడి మందలింపులను అశ్రద్ధ చేయకుము."*

***యిర్మియా 10:24*** *"ప్రభూ! మమ్ము మృదువుగా శిక్షింపుము. కోపముతో కఠినముగా దండింతునేని మేము నాశనమై పోయెదము."*

***తలంపు 2:*** దేవుడు మానవుని ఎల్లప్పుడు అపనమ్మకములోను, అవిశ్వాసముతోను ఉండనీయడు. జెకర్యా విషయంలో జరిగినట్లు, అపనమ్మకము మరియు అవిశ్వాసము అంతటిని లోకము నుండి తీసివేయబడు రోజు త్వరలో రానున్నది.

జెకర్యా దేవాలయంలో మామూలుగా ఉండే సమయం కన్నా ఎక్కువ సేపు గడిపాడని గుర్తుంచుకోండి. లోపల ఏం జరుగుతుందని ప్రజలు బయట కలవరపడ్డారు. ఆయన వెలుపలికి వచ్చినప్పుడు, ప్రజలకు ఆశీర్వాద సాంగ్యమును అతడు జరిపించాల్సి ఉంది. కాని అతడు మాట్లాడలేకపోయాడు. ఆయన చేయగలిగిందంతా, చేతితో సంజ్ఞలు చేయడమే! ఇక్కడ ముఖ్యమైన పాఠమును గుర్తించండి. దేవుని సన్నిధిలో జెకర్యా గడిపాడని ప్రజలకు అర్థమయింది. అతడు ఒక దర్శనమును చూసాడని వారనుకున్నారు. జెకర్యాకు అపనమ్మకము కలిగినప్పటికి, దేవుని ముందు విశ్వాసముతో అతడు జీవించాడు. అందుచేత దేవుడు జెకర్యాను, ఎలిశబేతమ్మను కలిసి తన వాగ్దానమును వారికి దయచేసెను.

***తలంపు 1:*** మన విశ్వాసము బలహీనముగా ఉన్నప్పటికి, ఈ సంఘటన మనకు ఎంతో ఊరటనిస్తుంది.

## IX. లూకా 01:23-25 దేవుడు తన వాగ్దానమును నిలబెట్టుకొనుట

దేవుడు తన వాగ్దానమును నిలబెట్టుకొనుటను కన్నులారా చూసిన తల్లిదండ్రులు వారు. అయితే ఒక విషయం గమనించండి. దేవుడు తమను ఎందుకు ఆశీర్వదించెనని తెలియజేయుటకు వారు రెండు కార్యాలను చేసారు.

1. వారు బాధ్యతాయుతముగా ప్రవర్తించారు. నిజానికి జెకర్యా అనారోగ్యముగా ఉన్నాడు. అతని స్వరం పూర్తిగా పోగొట్టుకున్నాడు. అలా వైకల్యంతో బాధపడుతున్నప్పటికి, అతని విధులను సక్రమంగా నెరవేర్చాడు. అతడు చేయగలిగిందంతా బాధ్యతాయుక్తముగాను, విశ్వాసముతోను నెరవేర్చాడు. ఇది మనకు ఎంతట గొప్ప ఆదర్శము!

2. వారు దేవుని సన్నిధిలోనికి ప్రవేశించారు. జెకర్యా తన విధులను నిర్వర్తించిన తరువాత, తన భార్యతో కలిసి ఇంటికి తిరిగివచ్చాడు. బహుశా జెకర్యా సమయమంతా ఇంటివద్దనే ఉండి, ధ్యానములోను ప్రార్థనలోను గడిపి ఉంటాడు. ఎందుకంటే అతడు ఇతరులతో మాట్లాడలేడు కాబట్టి. అయితే ఎలిశబేతు ప్రవర్తనను ఒకసారి ఆలోచించండి. ఐదు నెలలు ఆమె బహుశా ఇంట్లోనే ఉండి ఉంటుంది. ఎందుకు? దేవదూత తెచ్చిన గొప్ప దైవసందేశమును జీర్ణించుకోలేక పోయి ఉంటుంది. దేవునితో ఏకాంతముగా గడుపుటకు ఆమెకు సమయం కావలసి ఉంది. దేవునిచే అద్భుత రీతిలో వాడబడు ఒక గొప్ప ప్రవక్తను ఈ లోకమునకు అందించుటకు ఆమె శారీరకంగా, మానసికంగా తయారు కావలసి ఉంది.

   ఆమె గర్భవతియని ఎవరికి తెలియకుండా దాచిపెట్టిదనడం అబద్ధం. ఎందుకంటే ఆమె మొదటి ఐదు నెలలు మాత్రమే ఇంటిలో గడిపింది. ఆ తరువాత ఆమె అందరి ఎదుట బహిరంగముగా తిరిగిందని లేఖనము తెలుపుచున్నవి. (వ.39-40,57 చూడండి)

   ***తలంపు 1:*** ఒక ముఖ్యమైన విషయమును గమనించండి. ఒక ఉన్నతమైన పరిచర్య కొరకు తయారు కావడం ఎంతో అవసరం. ముఖ్యంగా తన్ను తాను దేవుని సన్నిధిలో సిద్ధము చేసుకొనుట – శారీరకంగాను, మానసికముగాను, ఆత్మీయంగాను – అన్ని విధములుగా తయారు చేసుకొనుట చాలా ముఖ్యం. దేవునితో ఏకాంతముగా ప్రార్థనలోను, ధ్యానములోను సమయాన్ని గడపడం ఎంతో ముఖ్యం.





***యోవేలు 2:12-13*** *"ప్రభువిట్లనుచున్నాడు. 'ఇప్పుడైనను మీరు పూర్ణ హృదయముతో నా చెంతకు మరలి రండు. ఉపవాసముతో, సంతాపముతో, ఏడ్పులతో నా వద్దకు తిరిగి రండు. మీరు ప్రభువు చెంతకు తిరిగి రండు. అతడు కరుణామయుడు, దయాపరుడు, సులభముగా కోపపడువాడు కాదు. అనంతమైన ప్రేమ కలవాడు. తాను నిశ్చయించుకొన్నట్లు శిక్షింపక మన్నించి వదలివేయువాడు."*

***హెబ్రీ 2:12-13*** *"కనుక మనము, కలుషముల నుండి శుద్ధినొందిన నిష్కపటమగు హృదయము లతోను, స్వచ్ఛమగు నీటితో కడుగబడిన శరీరములతోను, గట్టి విశ్వాసముతోను దేవుని సమీపింతము."*

***యాకోబు 4:8*** *"దేవుని దరికి చేరుకొనుడు. అప్పుడు ఆయన మీకు దగ్గరవాడగును. పాపాత్ములారా! మీ చేతులు శుభ్రము చేసికొనుడు. ద్విమనస్కులారా! హృదయములను శుద్ధి యొనర్చుకొనుడు."*

***యాకోబు 5:13*** *"మీలో ఎవడైన కష్టములో ఉన్నాడా? అయినచో అతడు ప్రార్థింపవలెను. ఎవడైన సౌఖ్యముగా ఉన్నాడా? ఉన్నచో అతడు స్తుతింపవలెను."*

***కీర్తన 34:18*** *"వేదన వలన గుండె పగిలిన వారికి ప్రభువు చేరువలోనేయుండును. బాధల వలన ధైర్యము కోల్పోయిన వారిని అతడు రక్షించును."*

***కీర్తన 57:1*** *"ప్రభూ! నా మీద దయజూపుము. నా మీద దయజూపుము. నేను నిన్నాశ్రయించితిని. అపాయములెల్ల తొలగిపోయినదాక నేను నీ రెక్కల మాటున దాగుకొందును."* ■